## తెలుగువారికే ప్రత్యేకం!



ప్రతి పండుగా భిన్న ప్రాంతాల్లో విభిన్నంగా జరుగుతుంది. శ్రీరామనవమి కూడా అంతే! చలువ పందిళ్లు, రథయాత్రలు, రామకథాగానం, ప్రత్యేక పూజలు, మంటపాలు... అన్నిచోట్లా కనిపించేవే. కానీ సీతారామకల్యాణం మాత్రం తెలుగునాటే అందులోనూ భద్రాచలంలోనే ప్రశస్తంగా జరుగుతుంది. రాముడు నడయాడిన దండకారణ్యంలో భాగం భద్రాచలం. పంచవటిలో పర్ణశాల నిర్మించుకుని సీతమ్మతో వనవాసాన్ని గడిపింది అక్కడే. శబరిని అనుగ్రహించి నదిగాను, భద్రుని కరుణించి కొండగాను అమరత్వం కల్పించిన చోటూ అదే. అక్కడ వెలసిన సీతారామచంద్రస్వామి విగ్రహాలకు భవ్యమైన మందిరాన్ని నిర్మించేందుకు కంచర్ల గోపన్న చేసిన కృషి తెలియంది ఎవరికి? పన్నెండేళ్ల పాటు చెరసాలలో ఉన్నా... తన కష్టాలకు బాధపడుతూ, రాముడిని నిందాస్తుతి చేస్తూ... ఆ ప్రయాణంలో రామదాసుగా మారిన తన కీర్తనలు విని పరవశించనిది ఎవరు? గోపన్న భద్రాచలంలో కేవలం ధూపదీప నైవేద్యాలకు మాత్రమే ఏర్పాట్లు చేయలేదు. ఏటా సీతారామకల్యాణం ఘనంగా జరిగేందుకు తగిన కైంకర్యాలనూ అందించాడు. జీలకర్ర బెల్లం, మంగళసూత్రధారణ, తలంబ్రాలు... ఇలా అచ్చ తెలుగునాట జరిగే పెళ్లిలాగానే భద్రాచలంలో కల్యాణం జరుగుతుంది.





## అడుగడుగునా ఆదర్శం!

తన ఎదురుగా ఉన్న వ్యక్తి భావోద్వేగాలకు అనుగుణంగా ప్రవర్తించడం రాముడి ప్రత్యేకత. కోపంలో ఉన్న లక్ష్మణుడిని శాంతింపచేసినా, దుఖంతో తల్లడిల్లిన భరతుడిని ఊరడించినా, తన దగ్గరికి వచ్చిన గుహుడిని అనునయించినా... తన మాటకు సాటి లేదు. అందుకు వాలితో జరిగిన సంభాషణే సాక్ష్యం. రాముడి బాణానికి కుప్పకూలిన వాలి, అధర్మంగా తనను చంపాడంటూ వాపోతాడు. అందుకు రాముడు 'తమ్ముడు, కుమారుడు, శిష్యుడు... ఈ ముగ్గురినీ కూడా కొడుకులుగానే భావించాలి. అలాంటి నీ తమ్ముడి భార్య తారను, కోడలు వరసయ్యే రుమను చెరపట్టావు. నీ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించావు కాబట్టి నిన్ను చంపడం తప్పు కాదు' అని చెప్పుకొస్తాడు.

---

రాముడు పొరపాట్లు చేయలేదా అంటే లేకేం. ఎంతైనా మానవ రూపంలో ఉన్నాడు కదా. అందుకే లోకకల్యాణం కోసమైనా పొరపాటు చేసినా, అలా చేయకుండా ఉండాల్సిందని ఒప్పుకొంటాడు కూడా! అందుకు శూర్పణఖ వృత్తాంతమే నిదర్శనం. రాముడిని చూసి మోహించిన శూర్పణఖను చూసి కాసేపు ఆటపట్టిద్దాం అనుకుంటారు రామలక్ష్మణులు. తనకు భార్య ఉంది కాబట్టి లక్ష్మణుడిని పెళ్లి చేసుకోమని రాముడు, నీలాంటి అందగత్తె కోసం రాముడు భార్యను వదులుకుంటాడులే అని లక్ష్మణుడు... ఇద్దరూ అన్న మాటలకు ఉబ్బిపోయిన శూర్పణఖ, ఏకంగా సీతమ్మ మీదనే దాడి చేయబోతుంది. అదంతా చూసిన రాముడు 'దుర్మార్గులతో పరిహాసం చేయకూడదు. లేకపోతే ఇలాంటి ప్రమాదాలే జరుగుతాయి' అని లక్ష్మణుడితో అంటాడు.

---

రాముడికి పట్టాభిషేకం చేయాలని నిశ్చయించుకున్న దశరథుడు, ఆ విషయాన్ని సభలో ప్రకటించి వారి అభిప్రాయాన్ని అడుగుతాడు. 'నా మాటను కాదనలేకో, నన్ను ఎదిరించడం ఇష్టం లేకో కాకుండా... మీరు నిజంగానే రాముడిని రాజుగా కోరుకుంటున్నారా?' అని అడుగుతాడు. అందుకు పౌరులంతా ఏకగ్రీవంగా రామరాజ్యాన్ని కోరుకుంటారు. రాజ్యాన్ని నిలబెట్టుకోగలిగే తెలివీ పరాక్రమం తనకు ఉన్నాయనీ, మనిషిలో మృదుత్వం ఉన్నా నిర్ణయాలకు కట్టుబడి ఉంటాడనీ, రాజ్యంలో ఎవరికి దుఃఖం కలిగినా తనకే ఆ కష్టం వచ్చినట్టు... ఎవరు ఆనందించినా తన బిడ్డలే సంతోషపడినట్టు భావిస్తాడనీ చెప్పుకొస్తారు. ఓ నాయకుడికి ఇంత కంటే గొప్ప లక్షణాలు మరేం కావాలి!

---

ఒక తల్లి కడుపున పుట్టకపోయినా రామలక్ష్మణుల మధ్య సోదరభావం ఎంత గాఢంగా ఉండేదో మనకు తెలియంది కాదు. లక్ష్మణుడు.. రాముడిని అనుసరించినట్టు కనిపించినా... తనను అంతే అభిమానంతో గమనించుకున్నాడు రాముడు. 'లక్ష్మణుడు పక్కన లేకపోతే శ్రీరాముడు నిద్రపోయేవాడే కాదు. తను లేకుండా మంచి ఆహారం కూడా తీసుకునేవాడే కాదు' అంటుంది బాలకాండ. తమ్ముడి మాట ఎందుకు వినాలనే భేషజం కూడా రాముడిలో కనిపించదు. సీతమ్మ అపహరణ సమయంలో, లక్ష్మణుడి కర్తవ్య బోధే రాముణ్ని ముందుకు కదిలేలా చేసింది.

**ఇవేనా రాముడి ప్రత్యేకతలు! ఇంకా లెక్కలేనన్ని ఉన్నాయి. రావణుడితో యుద్ధ సమయంలో వ్యూహకర్తగా, శరణన్న విభీషణుడిని అక్కున చేర్చుకున్న శరణాగతవత్సలుడిగా, వానరులు అని తక్కువగా చూడకుండా ఆ సైన్యంతోనే రాక్షస సంహారం చేసిన రాజనీతిజ్ఞుడిగా, సీతమ్మ కోసం విలపించిన ప్రేమికుడిగా... రామపాదం కదిలిన ప్రతిచోటూ ఓ అద్భుతమైన ఆదర్శం కనిపిస్తుంది. వాటిని పాటించినవారికి తన ఆశీస్సూ లభిస్తుంది.**